ఈనాడు
వనపర్తి
శనివారం అక్టోబరు 5, 2024 5

నిబంధనల ఉల్లంఘనులు



వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : చట్టాన్ని అమలు చేసే పోలీసుల్లో కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కంచె చేను మేస్తే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఉద్యోగులు సీసీఏ (క్లాసిఫికేషన్ కంట్రోల్ అండ్ అప్పీల్.. వర్గీకరణ నియంత్రణ అప్పీల్) నిబంధనలకు విరుద్ధంగా ఇతర వ్యాపారాలు చేస్తూ మోసగిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండటం తెలిసిందే. వృత్తి ధర్మాన్ని నెరవేర్చకుండా నిబంధనలకు విరుద్ధంగా రియల్‌ఎస్టేట్, వడ్డీ వ్యాపారం, మద్యం దుకాణాలు, చీటీలు, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. రక్షకులు చేసే అక్రమాలపై ఫిర్యాదులు చేయడానికి సామాన్యులు జంకుతున్నారు.

తప్పుడు పత్రాలతో రుణాలు : ఉద్యోగులకు బ్యాంకు అధికారులు రుణాలను ఒకరి పేరున ఒకసారి మాత్రమే ఇస్తారు. మళ్లీ వేరే బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకుంటే ఇతర బ్యాంకుల నుంచి వివరాలు తెలుసుకుంటారు. బకాయి ఉంటే అతని వేతనం బట్టి మంజూరు చేస్తారు. ఇటీవల పోలీసుశాఖలో కొందరు తప్పుడు పత్రాలతో రెండు బ్యాంకుల నుంచి గృహ రుణాలు తీసుకున్నారు. ఇటీవల జిల్లాలో ఇద్దరు పోలీసులు స్థాయిని మించి అప్పు చేసి తప్పించుకు తిరుగుతుండగా ఎస్పీ సీసీఏ నిబంధనల అమలు మేరకు వారిపై చర్యలు తీసుకున్నారు. రుణాలు తీసుకున్న పోలీసులపై ఆశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

వృత్తిధర్మం విస్మరిస్తే ఉద్యోగం కోల్పోతారు

ఉద్యోగులు తమ వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలి. సీసీఏ నిబంధనలు తోసిరాజంటూ ఎవరైనా వ్యాపారాలు, ఇతర వ్యాపకాలు నిర్వహిస్తున్నట్లు తేలితే సస్పెన్షన్‌కు గురవడమే కాకుండా ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వస్తుంది. **- రావుల గిరిధర్, ఎస్పీ**

II యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 35,815 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఐదు యూనిట్లు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. గడిచిన 24 గంటల్లో ఎగువన 4.319, దిగువన 4.650 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 229.586, దిగువన 204.994 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరుకుందని జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) సూరిబాబు తెలిపారు.

288 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన


పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపిక అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మూడో రోజు శుక్రవారం కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 288 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశామని జిల్లా విద్యాధికారి గోవిందరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు. కొందరి అభ్యర్థుల పత్రాలను స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. శుక్రవారం 131 మంది అభ్యర్థుల పత్రాలు పరిశీలించారు. ఎస్జీటీ 41, స్కూల్ అసిస్టెంట్లు 65, భాషా పండితులు 13, ఎస్ఏ ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 6, పీఈటీ 3, పీడీ ముగ్గురు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి రవీందర్ చారి, పర్యవేక్షుడు అజీమ్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణిగా జోగులాంబ


అలంకారంలో జోగులాంబ అమ్మవారు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రెండో రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఆలయంలో ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం సహస్రనామార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణ అర్చన, చండీహోమం, రాత్రి 7 గంటలకు కొలువు పూజలో భాగంగా సువాసిని, కుమారి పూజలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ రథంపై ప్రదక్షణ నిర్వహించారు. ఈవో పురేందర్, అర్చకులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

సొంతూళ్లకు వెళ్తున్నారా.. అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా పాఠశాలలకు సెలవులివ్వడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్తుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ గిరిధర్ తెలిపారు. ఇళ్లలో బంగారం, నగదును ఉంటే బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. వాహనాలను ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. పోలీసు సిబ్బంది గస్తీ పెంచుతామని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలను నియంత్రివచ్చన్నారు.

ఎక్కువ శబ్దాలు నిషేధం..

వనపర్తి న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లాలో మతపరమైన ఊరేగింపుల్లో డీజేలకు నిషేధమని కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎస్పీ గిరిధర్ తెలిపారు. డీజేల నుంచి ఉత్పన్నమయ్యే అధిక శబ్దం కారణంగా గుండెపోటు, ఇతర హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశముందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు.

మిషన్ భగీరథపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న ఈఈ మేఘారెడ్డి, వేదికపై ఎస్ఈ వెంకటరమణ తదితరులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిపై ప్రజలు అపోహలు వీడాలని జిల్లా ఎస్ఈ వెంకటరమణ పేర్కొన్నారు. ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల తాగునీటి సరఫరా సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన శిక్షణనుద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకుంటున్న ఆర్వో ప్లాంట్ల కంటే నాణ్యమైన శుద్ధజలం మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఈ పథకం విస్తరింపజేసే పనులు వేసవికి ముందే పూర్తి చేయనున్నామని వెల్లడించారు. పంచాయతీ కార్మికులు అవసరమైతే గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉన్నతాధికారులు ఇళ్లలో, కార్యాలయాల్లో మిషన్ భగీరథ నీటినే తాగుతున్నారని తెలిపారు. తాగునీటిని కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడకూడదతన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. క్షేత్ర స్థాయిలో పథకం నిర్వాహణలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ మేఘారెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, గ్రిడ్ డీఈ రామసుబ్బారావు, డీపీవో శ్రీరాంరెడ్డి, మిషన్ భగీరథ ఏఈ రుకేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు


అప్పాయిపల్లిలో పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ మధుమేహం వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న చక్కెర వ్యాధి నిర్ధారణ రక్తపరీక్షల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఒక్క గ్రామాన్నే ఎంపిక చేశామని త్వరలో మరో వంద గ్రామాల్లో వ్యాధి నిర్ధారణ రక్తపరీక్షలు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. డిజిటల్ కార్డు సర్వే త్వరగా పూర్తి చేయాలి డిజిటల్ కార్డుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన అంజనగిరి గ్రామం, వనపర్తి పదో వార్డులో చేపట్టిన సర్వేను అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటిని వదిలి పెట్టకుండా రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఎంపీడీవో, పి. రాఘవ, డిప్యూటీ వైద్యఆరోగ్య అధికారి సాయినాథ్‌రెడ్డి, పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



రెజ్లింగ్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : తమది క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం ధన్వాడ అప్పోజి మైదానంలో 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కప్‌లోనూ రెజ్లింగ్ అవకాశం కల్పించామన్నారు. ధన్వాడలో రెజ్లింగ్ హాలు నిర్మాణం కోసం రూ.11 లక్షలు కలెక్టర్ కేటాయించనున్నారు. డీఈవో వెంకటేశ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, పేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివారెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంతు, డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాగ్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ ప్రారంభం

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పోజి మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలు పెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు


కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పోటీపడగా కరీంనగర్ - మహబూబ్‌నగర్ మొదటి సెమీ ఫైనల్, ఆదిలాబాద్ - వరంగల్ జట్టు ద్వితీయ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. చివరికి కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్టు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ - హైదరాబాద్ మ్యాచ్ శనివారం మొదటి సెషన్‌లో ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, నర్సిములు, శ్రీనివాస్, రఫత్ పాల్గొన్నారు.

విస్తీర్ణంలో దేశంలో రెండో అతి పెద్ద పులుల అభయారణ్యం నల్లమల. అరుదైన వన్యప్రాణులు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలకు నెలవు. 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన ఏటీఆర్‌లో ఎంతో జీవవైవిధ్యం కనిపిస్తుంది. కర్ణాటక సరిహద్దున కృష్ణా తీరం కూడా జీవ జాతులకు ఆలవాలమే. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా ఇక్కడి విశేషాలు తెలుసుకుందాం.

జీవుల ఆలవాలం.. నిలపాలి కలకాలం



ధన్వాడలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ ర్యాలీ



మద్దిమడుగు రేంజ్‌లో కనిపించే అరుదైన చింకార



మూషిక జింకలు

న్యూస్‌టుడే- అమ్రాబాద్, కృష్ణ

ఉమ్మడి పాలమూరు జిల్లా అరుదైన వన్యప్రాణులకు ఆలవాలం. అందులోనూ నల్లమల ప్రత్యేకం. సుమారు 180 కిలోమీటర్ల సరిహద్దుగా ఉన్న కృష్ణానది వేసవిలో జంతుజాలం దప్పిక తీరుస్తూ కాపాడుతోంది. అటవీ అధికారుల చర్యల మూలంగా 10 ఏళ్లలో ఉన్న పెద్ద పులుల సంఖ్య 38కి చేరుకుంది. క్రమేపీ ఇతర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అంతరించిపోయే దశలో ఉన్న జంతుజాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలలో పెద్దపులులతో పాటు జింకలు, దుప్పులు, చిరుతపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు, కొండగొర్రెలతో పాటు ఎన్నో జాతుల జంతువులు నివసిస్తున్నాయి.

ఏం చేస్తున్నారు?

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా ఉన్న మూషిక జింకలు వివిధ కారణాల వల్ల అంతరించిపోయాయి. వాటిని పునరుద్ధరించేందుకు అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి తెప్పించి అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా మన్ననూరు రేంజ్‌లోని పెద్ద కుంట్లోని చెరువు ప్రాంతంలో ప్రత్యేక ఏర్పాటు చేసి అందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 6 ఆడ, 2 మగ మూషిక జింకలు చొప్పున 17 బ్యాచులు హైదరాబాద్ నుంచి తెచ్చి నల్లమల వాతావరణానికి అలవాటయ్యే వరకు షెడ్యుల్లో పెంచి నెల తర్వాత అడవిలో వదులుతున్నారు. క్రమేపీ వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీప్రాంతం పొడుగునా ప్లాస్టిక్ నిషేధించారు.

చికారాలు ప్రత్యేకం

కృష్ణ జింకలను పోలి ఉండే చింకారాలు ఏటీఆర్‌కే ప్రత్యేకం. నల్లమలలోని మద్దిమడుగు రేంజ్‌తో పాటు కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వంపులు తిరిగిన కొమ్ములు, బెదురు చూపులతో అత్యంత పిరికిగా ఉండే చింకారాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో ఉండే పశువులు, గొర్రెల మందలు వాటి అభివృద్ధికి ఆటంకంగా మారాయి. అడవిలో లభించే మేతను పశువులు, గొర్రెలు తినిపోవటంతో ఇవి ఆహారం కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఈప్రాంతంలో పశువులు, గొర్రెల మందలను అధికారులు నియంత్రిస్తున్నారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచటంతోపాటు తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆవాసాల్లోకి మొసళ్లు, జింకలు

గత 30 ఏళ్ల క్రితం వరకు జింకలు, మొసళ్లను వేళ్లపై లెక్కించేవారు. ఇప్పుడు వాటి సంతతి గణనీయంగా పెరిగింది. నీటి లభ్యతతో పాటు విరివిగా ఆహారం లభించడంతో సంతతి గణనీయంగా పెరిగింది. మొసళ్ల విషయానికి వస్తే మొసలి పిల్ల చాలా చిన్నదిగా ఉంటుంది. నదిలో నుంచి నీరు ఎత్తిపోసే క్రమంలో ఆయా మోటార్ల ద్వారా పంట కాలవలలోకి చేరి సమీపంలోని చెరువులలోకి చేరుతున్నాయి. మనిషి అత్యధికంగా కోడి మాంసం తింటూ ఉండటంతో వాటి వ్యర్థాలు స్థానిక చెరువులు, నీటి కుంటలలో పార వేస్తున్నారు. దీంతో మొసళ్లకు మంచి ఆహారం లభిస్తుండటంతో జనావాసాలలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు కర్ణాటక సరిహద్దులో కనిపించే జింకలు ఇప్పుడు పూర్తిగా గ్రామాల శివార్లలోకి చొచ్చుకొచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ మధ్య ఊట్కూరు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈ సమస్యపై రైతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద జింకల సంరక్షణ కోసం 70 ఎకరాల స్థలం కేటాయించారు. రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఈ కేంద్రం ఏర్పాటు ముందుకు సాగలేదు. ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖాధికారి నీలేష్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

నీటి కుక్కలు



కృష్ణానదిలోని నీటి కుక్కలు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సుమారు 180 కిలో మీటర్ల పొడవైన కృష్ణానదితో పాటు లింగాల, తెలకపల్లి ప్రాంతాల్లో నీటి కుక్కలు కనిపిస్తాయి. చేపలు, ఎండ్రగిచ్చలు ఆహారంగా తీసుకునే నీటి కుక్కలు మత్స్యకారులు చేపల కోసం వేసే వలలో చిక్కుకుని మృతి చెందుతుంటాయి. ఈకారణంగా నానాటికి నీటికుక్కలు అంతరించి పోయే అవకాశం ఉంది. ఇవే కాకుండ పసుపు గొంతు బుల్‌బుల్ పిచ్చుక, స్పాట్ బెల్లీడ్ డేగ-గుడ్లగూబ, బ్లాక్ బాజా లాంటి అరుదైన పక్షి జాతులు నల్లమలలో ఉన్నాయి.

అండర్-19 క్రికెట్ ఫైనల్‌కు పాలమూరు జట్టు

సెమీస్‌లో ఖమ్మంపై 60 పరుగుల తేడాతో ఘన విజయం



సెమీస్‌లో నెగ్గి ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ (క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో ఖమ్మం జట్టుపై 60 పరుగుల తేడాతో నెగ్గింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 (146 బంతుల్లో 4×11, 6×2) సాయంతో శతకం బాదాడు. కె. సాహిల్ 45, నగేశ్ 25, షాదాబ్ అహ్మద్ 22 పరుగులు చేశారు. అనంతరం ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు నుంచి ముఖీత్ 4, బి.రాజు, శశాంక్, షాదాబ్, సాహిల్ ఒక్కో వికెట్ తీశారు. శనివారం ఫైనల్‌లో జిల్లా జట్టు కరీంనగర్‌తో తలపడనుంది. ఫైనల్‌కు చేరిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా, సంఘం సభ్యులు అభినందించారు.


అలంపూర్ ఆలయాల ఛైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి



ఆలయాల నూతన ధర్మకర్తల సభ్యులు, చిత్రంలో సంపత్‌కుమార్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులతో శుక్రవారం ఈవో పురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ఛైర్మన్‌గా కొంకల నాగేశ్వర్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు. అందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మిఠాయి తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఆర్డీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, టెలికం సలహా సంఘం సభ్యుడు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

అర కోటితో అలంకారం.. ఆకట్టుకునే రూపం



కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు విలువజేసే నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. వరిదేల శమీవృక్షం వద్ద ఉన్న దుర్గామాతను గాయత్రి అవతారంలో అలంకరించారు.

ఆటలతో ఐక్యత, ఆరోగ్యం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్. చిత్రంలో నవీన్‌కుమార్‌రెడ్డి, నరేందర్ తదితరులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఐకమత్యం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అలాంటి ఆటలకు నిత్యం కొంత సమయం కేటాయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మినీస్టేడియంలో భారాస నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న క్రీడలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ టోర్నమెంట్ 15 రోజులపాటు జరుగుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 70 టీంలు ఇందులో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ నరేందర్, వైస్‌ఛైర్మన్ నటరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్, బచ్చుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు చర్యలు



దేవరకద్రలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయాన్ని, దేవరకద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడున్న పాఠకులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా.రియాజ్ గ్రంథాలయంలో సమస్యలపై యువతను ఆరాతీయగా భవనాన్ని విస్తరించాలని, మరిన్ని కుర్చీలు, పోటీపరీక్షల కొత్త పుస్తకాలు, మాసపత్రికలను సమకూర్చాలని కోరారు. మహబూబ్‌నగర్, నారాయణపేట గ్రంథాలయాల కార్యదర్శులు మనోజ్‌కుమార్, సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం

- సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు
- లబోదిబోమంటున్న మహిళలు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు పురపాలిక 17వ వార్డు కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్ - స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. మహిళా సంఘాల పొదుపు ఖాతాలు పర్యవేక్షించే ఓ ఆర్పీ సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేర్ల మీద భారీ మొత్తంలో రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్ఎల్ఎఫ్ పరిధి పలు సంఘాల మహిళలు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేయించినా మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా డీఎంసీ శివకుమార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌లో మహిళల పొదుపు సొమ్ముతో పాటు రుణాల పేరిట ఆర్పీ పెద్ద మొత్తంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఎమ్మెల్యే, పుర కమిషనర్ ఆదేశాలతో ముగ్గురు సీవోలు, నలుగురు సీనియర్ ఆర్పీలతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి శనివారం నుంచి కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవకతవకలు వాస్తవమేనని, ఇటీవల కొంత మంది మహిళలు ఆర్పీపై ఫిర్యాదు చేయడంతో నయానా భయానా రూ.6 లక్షల వరకు సొమ్ము రికవరీ చేయించానని వార్డు కౌన్సిలర్ జంగమ్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో మిగతా సంఘాల వాళ్లు కూడా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు అధికారులు ఏం చేసినట్లు?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 32 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. సభ్యులు బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకోవాలంటే వారి పేర్లతో ఆర్పీ సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ - మైక్రో క్రెడిట్ ప్లాన్) తయారు చేసి ఒక్కో సభ్యురాలి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంసీపీని బ్యాంకులో సమర్పించాక క్షేత్రాధికారి (ఫీల్డ్ ఆఫీసర్) పరిశీలించి ఆయా మహిళలతో మాట్లాడి మరోమారు వారి సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లోనే రుణ మొత్తం జమ చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకుకు చెందిన క్షేత్రాధికారి ఆర్పీ చెప్పినట్లు విని మహిళల సంతకాలు తీసుకోకుండానే ఒక్కో మహిళ పేరు మీద రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు రుణాలు మంజూరు చేసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఇలా 32 సంఘాల్లోని చాలా మంది సభ్యుల పేర్ల మీద వారికి తెలియకుండానే ఆర్పీ పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం నిర్వహించే విచారణకు అన్ని సంఘాల సభ్యులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఇతర దస్త్రాలతో హాజరు కావాలని సూచించామని, విచారణలో అవకతవకలు పూర్తిస్థాయిలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుందని మెప్మా డీఎంసీ పేర్కొన్నారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్‌రావు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : నక్సలైట్‌నని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి ఫోన్‌పే ద్వార డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ నక్సలైట్‌నని. . రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారికి సహకరిస్తున్న అయిజ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ టి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు చేశారు. బాధ్యతారాహిత్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగా శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారికి సహకరిస్తున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం రుజువుకావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎస్పీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో తెలిపారు.

ఒకే రోజు ముగ్గురిపై శునకాల దాడి



గాయాలపాలైన రేవంత్

మానవపాడు, న్యూస్‌టుడే: ఒకే రోజు ముగ్గురు వ్యక్తులపై శునకాలు దాడిచేశాయి. అమరవాయి గ్రామానికి చెందిన పరశురాముడు కుమారుడు రేవంత్ శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఇంటి నుంచి దుకాణానికి బయలు దేరాడు. వెళ్తున్న క్రమంలో రేవంత్‌పై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని శునకాలను చెదరగొట్టారు. అప్పటికే బాలుడిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు రేవంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన రామదాసు కుమారుడు శివపైనా కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తుండగా అమరవాయిలో శునకాలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామాల్లో శునకాల స్వైరవిహారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పెరుగుతున్న ఓటర్లను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో 31 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గంలో 20, దేవరకద్ర 4, మక్తల్ ఒకటి, కొల్లాపూర్ నియోజకవర్గంలో ఆరు పోలింగ్ కేంద్రాల కొత్తగా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వనపర్తి టీచర్స్‌కాలనీ, ఆర్టీసీకాలనీలో కొంత మంది ఓటర్లకు పోలింగ్ కేంద్రం దూరమవుతోందని రాజకీయ పార్టీల నాయకులు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, ఈ సెక్షన్ పర్యవేక్షకుడు కిషన్‌నాయక్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠకు ఏర్పాట్లు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీదేవమ్మపల్లిలో ధ్వజస్తంభం ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట ఈనెల 5, 6, 7వ తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వేదపండితులు మూడు రోజులపాటు పూజలు, హోమాలు నిర్వహిస్తారని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని రంగాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో చిన్నారులు వారి వయసుకు తగ్గ బరువు ఉన్నారా? లేరా. అని సంబంధిత టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో రోజా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఇంటర్ విద్యార్థులకు సెలవులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ఇంటర్ కళాశాలలకు ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు నిబంధనలు పాటించాలని సూచించారు. కళాశాలలు 14వ తేదీన పునః ప్రారంభమవుతాయని చెప్పారు.

శివాలయం పునః నిర్మాణానికి శ్రీకారం

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటలోని పురాతన శివాలయాన్ని రూ.కోటితో పునః నిర్మాణం చేపట్టనున్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి దేవాదాయశాఖకు చెందిన ఇంజినీరింగు విభాగం ఎస్‌ఈ కె.దుర్గాప్రసాద్, స్థపతి వల్లి నాయగం, డీఈ వేమూరి శ్రీనివాసశర్మ, ఏఈ కె.బాలయ్య, సహాయ స్థపతిలు పి.గణేషన్, ఎ.సంజీవ్‌కుమార్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కొండారెడ్డి, దేవాలయ శిల్పి శంకరాచారి దేవాలయం నిర్మాణం చేపట్టే చోట ముగ్గు పోశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆలయ పూజారి శివప్రసాద్, గ్రామస్థులు సత్యనారాయణ, పార్థసారథి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీకి దరఖాస్తు చేసుకోవాలి

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వం అందించే రాయితీ కోసం రైతులు శనివారం దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ నకళ్లతో పాటు, ఫొటోలను వీపనగండ్ల రైతు వేదికలో అందజేయాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చడంలో ఆలస్యం

పెబ్బేరు, న్యూస్‌టుడే: ఓ బియ్యం మిల్లు వద్ద అనుమతి లేకుండా నిర్మించిన షెడ్డును కూల్చడంలో అధికారులు అలసత్వం వహించడంతో ఆ యజమాని ఒక్క రోజులోనే కోర్టు స్టే తెచ్చుకొని అధికారులకు చూయించడంతో వారు నిర్మాణాన్ని కూల్చకుండా వదిలేసిన ఘటన మండలంలోని జనుంపల్లిలో వెలుగు చూసింది. గ్రామ శివారులోని సత్య ఇండస్ట్రీస్ అనే బియ్యం మిల్లు వద్ద యజమాని అనుమతి లేకుండా కార్మికుల కోసం షెడ్డు, కార్యాలయం నిర్మించారని.. ఈ నిర్మాణాలను బియ్యం మిల్లుకు సంబంధించిన దస్త్రాల్లో పొందు పరచలేదని ఇటీవల మిల్లును తనిఖీ చేసిన పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. వీటిని అక్రమంగా నిర్మించారని, తొలగించాలని పౌరసరఫరాల అధికారులు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)ని కోరారు. కొన్ని రోజుల క్రితమే వీటిని కూల్చాలని డీపీవో పెబ్బేరు మండల పరిషత్ ఎంపీవో రోజాను ఆదేశించారు. ఈనెల 3న ఉదయం అనుమతి లేకుండా ఉన్న నిర్మాణాలను కూల్చడానికి యంత్రాల కోసం వెతకగా అధికారులకు దొరకలేదు. సాయంత్రం పొక్లెయిన్ వస్తే అప్పటికీ యజమాని కోర్టు స్టే తెచ్చుకోవడంతో అధికారులు కూల్చకుండా వెనుతిరిగారు. ఈ విషయంపై ఎంపీవో మాట్లాడుతూ పొక్లెయిన్ కోసం ప్రయత్నించగా ఎవరూ రాలేదన్నారు. సాయంత్రం తర్వాత వస్తే నాలుగు వారాల వరకు యజమాని స్టే తెచ్చుకున్నారని.. దీంతో కూల్చలేక పోయామన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రక్తదాన శిబిరంలో భారాస నాయకులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : మాజీమంత్రి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు భారాస పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తిలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అధ్యక్షతన రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరంజన్ రెడ్డి యువసేన, భారాస యూత్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. గోపాల్‌పేట, పెబ్బేరులో వేడుకలు జరుపుకొన్నారు.

జూదరుల అరెస్టు

చిన్నంబావి, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పునూర్‌లో జూదం ఆడుతున్న వారిని అరెస్టు చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎవరైనా జూదం ఆడితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తొలగిన పూడిక.. తీరిన కల

పాన్‌గల్, న్యూస్‌టుడే : సుమారు నాలుగేళ్ల పాటు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్న చివరి ఆయకట్టు గ్రామాలకు ఎట్టకేలకు సాగునీరు చేరుతోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో పస్పుల బ్రాంచి కాల్వలో ఏళ్ల తరబడిగా పేరుకుపోయిన పూడిక, జమ్ము తొలగింది. ఫలితంగా చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీరు సాఫీగా అందుతోంది. కాల్వవెంట తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని అన్నదాతల్లో ఆనందం నెలకొంది. కాల్వ నీటిపై ఆధారపడి పంటలు సాగుచేసి నీరందక ఎండిపోయేవి. వర్షాలకు చెరువు, కుంటలు నిండినా కాల్వ నీరుపై ఆధారపడిన రైతులకు పూడికతీత సంతోషం నింపింది.



కొత్తపేట–దొండాయిపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వ

గతంలో తుమ్మలవాగు దాటడమే కష్టం..

కేఎల్ఐ కాల్వలు పూడికతో నిండుకోవడం, జమ్ము ఏపుగా పెరగడంతో సాగునీరు పాన్‌గల్ గ్రామ శివారులో ఉన్న తుమ్మలవాగు దాటి ముందుకు వెళ్లలేని పరిస్థితి. చివరి గ్రామాలైన పాన్‌గల్, కొత్తపేట, దొండాయిపల్లి, చందాపూర్, జమ్మాపూర్, కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి, కల్వరాల తదితర గ్రామాల రైతులు సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. కేతేపల్లి శివారులో వైజంక్షన్ వద్ద డీ2, డీ3 కాల్వ దగ్గరికి రైతులు రాత్రి వేళల్లో వెళ్లి షెట్టర్లను మూసి నీటిని తరలించుకునేవారు. పూడికతీతతో షెటర్లను మూసి నీటిని తరలించుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

భూగర్భ జలాలు పెరిగాయి..



కేఎల్ఐ కాల్వలో పూడిక తీయించి మంత్రి జూపల్లి కృష్ణారావు పుణ్యం కట్టుకున్నారు. నాలుగేళ్లుగా సాగునీటి విషయంలో రైతులు పడిన బాధలు వర్ణణాతీతం. గ్రామం చివరి ఆయకట్టులో ఉండటంతో పూర్తిస్థాయిలో కాల్వకు నీరు వచ్చాకనే వరి సాగుచేశా. నెల రోజులుగా కాల్వలో సాగునీరు పుష్కలంగా చివరి గ్రామం మల్లాయిపల్లి వరకు వెళ్తోంది. అంతేకాకుండా సాగునీటి కాల్వ నీటి ప్రవాహం కారణంగా పరిసర ప్రాంత రైతుల వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. - నాయుడు, రైతు, దొండాయిపల్లి

గతంలో పంట ఎండిపోయేది..



కొన్నేళ్లుగా ఖరీఫ్‌లోనే సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సాగుచేసిన వరి పంటకు నీరందక ఎండిపోయింది. ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో వరి సాగుచేశా. పాన్‌గల్ శివారులోని తుమ్మల వాగు దాటని సాగునీరు ఇప్పుడు కొత్తపేట దాటి చందాపూర్, మల్లాయిపల్లికి చేరడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం నీరు చూసి మురిసిపోతున్నాం. గతంలో ముందు గ్రామాల రైతులు పుష్కలంగా వచ్చిన నీటితో పంటలు పండించుకుంటే.. మా పంటలు ఎండిపోయేవి. - పి.రఘువర్ధన్‌రెడ్డి, రైతు, కొత్తపేట

నిధుల విడుదల మేరకు అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న పుర అధ్యక్షురాలు గాయత్రి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలికలో ప్రతిపాదిత పనులను నిధుల విడుదలకు అనుగుణంగా చేపట్టాలని పురపాలిక పాలకవర్గం తీర్మానించింది. శుక్రవారం పుర అధ్యక్షురాలు గాయత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ నాగరాజు ఎజెండాలోని అంశాలను ప్రవేశపెట్టారు. పట్టణంలో పురపాలిక చేపట్టే పనుల కోసం కొత్తగా పొక్లెయిన్, ట్రాక్టర్ కొనుగోలు చేయాలని ఆమోదించారు. అసంపూర్తి పనులను పూర్తి చేయించేందుకు ప్రాధాన్యతనివ్వాలని కౌన్సిలర్లు సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు విధిగా అనుమతులు తీసుకోవాలని తీర్మానించారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సమాచారం ఇవ్వకుండా తొలగిస్తామని, అనుమతి పొంది ఏర్పాటు చేసే వాటిని మూడు రోజుల్లో తొలగించాలని తీర్మానించారని కమిషనర్ వివరించారు. రహదారి విభాగిని మధ్య విద్యుత్తు స్తంభాలకు ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు పోషన్న, చెన్నయ్య, రామకృష్ణ, మహేశ్వరి, నాగలక్ష్మి, తబస్సుం బేగం, యాదమ్మ, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని మోసగించిన అధికారిని ఉద్యోగం నుంచి తొలగించాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే : ప్రభుత్వాన్ని మోసగించిన వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్‌కుమార్‌ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీసీ పొలిటికల్ ఐకాస ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఏకంగా ఉద్యోగుల సర్వీస్ పుస్తకంలోనే తన పుట్టిన ఏడాదిని ఐదేళ్లు పెంచుకున్న ఘనుడని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీని కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. తాజాగా ప్రభు వినయ్ మూడు నెలలుగా విధులకు రాకుండా హాజరు రిజిస్టర్, ఇతర ఫైళ్లను ఇంటికే తెప్పించుకుని సంతకాలు చేస్తూ జీతం తీసుకుంటున్నాడని, ఇదే విషయాన్ని వనపర్తి కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఐకాస నాయకులు బడే సాబ్, రాఘవేందర్ గౌడ్, మ్యాదరి రాజు తదితరులు వెంట ఉన్నారు.



పామాపురం భ్రమరాంబ సమేత రామేశ్వరాలయంలో..



కొత్తకోట మండలం పాలెంలో..



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో



కానాయపల్లి కోటిలింగేశ్వరాలయంలో..



ఆత్మకూరులో..



మదనాపురంలో..



పాన్‌గల్‌లో..

జగన్మాత.. పాహిమాం



గోపాల్‌పేటలో..

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తి పట్టణంలో దేవి నవరాత్రుల పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో చేశారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కొత్తకోట గ్రామీణం: మండలంలోని పామాపురం భ్రమరాంబ సమేత రామేశ్వరాలయంలో రాజరాజేశ్వరిదేవిగా, పాలెంలో శ్రీమహాలక్ష్మి దేవిగా, కొత్తకోట కన్యాకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవిగా, కానాయపల్లి కోటిలింగేశ్వరాలయంలో శ్రీమహాలక్ష్మి దేవిగా కొత్తకోట అంబా భవాని ఆలయంలో శ్రీబాలాత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తుల నుంచి పూజలందుకున్నారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పెబ్బేరు పట్టణం: కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవీ మాత గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి అభిషేకం చేసి, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మదనాపురం: మదనాపురం పెద్దమ్మశాలలో గాయత్రీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో ఆలయ ప్రధాన అర్చకులు గోపిస్వామి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: స్థానిక రాజీవ్ కూడలి, శివాజీనగర్, బీసీ కాలనీలో అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. కాళికాలయంలో పుర ఛైర్‌పర్సన్ వి.మంగమ్మ, మార్కెట్ మాజీ వైస్ ఛైర్మన్ నాగభూషణంగౌడ్ పూజలు చేశారు.

గోపాల్‌పేట: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోపాల్‌పేటలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలందుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరంగాపురం: వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారు గాయత్రి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆత్మకూరు: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను గాయత్రి దేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. నీలకంఠేశ్వర స్వామి, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలతో పాటు కేశవనగర్, వాల్మీకినగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. భక్తులకు అల్పాహారం, రాత్రి భోజన ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. బతుకమ్మ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.



తాటిపాములలో..





వనపర్తి వల్లభ్‌నగర్‌లో.. గణేశ్‌నగర్‌లో



ఆత్మకూరు బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో..



కొత్తకోట అంబా భవాని ఆలయంలో కుంకుమార్చన



అమరచింతలో భక్తుల పూజలు



వనపర్తి బండార్‌నగర్‌లో..

పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపునకు చర్యలు



పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : దసరా పండుగ నేపథ్యంలో పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆత్మకూరు మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసిన క్రమంలో బకాయిలో కొంత మేరకు పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలని ఆదేశిస్తున్నామన్నారు. వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితుల్లో నిర్దేశించిన మేరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీరాంరెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించి నివేదిక ఇవ్వండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. శుక్రవారం సమ్మరి రివిజన్‌లో భాగంగా వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అక్టోబరులో ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాల్సి ఉండగా రోల్‌తయారీ, కొత్త పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలపై ఆయన అవగాహన కల్పించారు. ● ధరణి దరఖాస్తుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు, ఉపతహసీల్దార్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకుంటా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్లు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ఫొటోగ్రాఫర్లకు అండగా ఉండి ఆదుకుంటానని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫొటోగ్రాఫర్ బీమా చేయించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఉన్న ఫొటోగ్రాఫర్లకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కావాల్సిన స్థలం సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షుడు పుట్టపాకల మహేశ్, అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం..కేసు నమోదు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం బసవన్నగడ్డ కాలనీకి చెందిన రమేశ్ ఈనెల మూడో తేదీన ఇంట్లో చరవాణి పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఎస్సై జయన్న తెలిపారు. కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుడు తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ.. పెద్దమందడి (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన సుజాత అదృశ్యమైనట్లు ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలిపారు. పెద్దమందడి మండలం జగత్‌పల్లిలో ఉంటున్న ఈమె సెప్టెంబరు 18న వనపర్తిలో కూలి పని చేసేందుకు వెళ్లి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. పలు గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు పట్టణం: పెబ్బేరు మండలం రామాపురం గ్రామానికి చెందిన బోయ రాజేష్ అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా సోమవారం గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

ఈర్లతండాలో చిరుత కలకలం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఈర్లతండా సమీపంలో బోడగట్టు ప్రాంతంలో చిరుత కలకలం రేపుతోంది. వారం రోజులుగా మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి, వసురాంతండా ప్రాంతంలో సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం బోడగట్టు ప్రాంతంలో చిరుత కనిపించిందని మళ్లీ శుక్రవారం గోదాం పరిసర ప్రాంతంలో కనిపించినట్లు రైతులు, తండా వాసులు తెలిపారు.

సామాజిక కార్యకర్త మృతి.. ఎమ్మెల్యే సంతాపం



బాధిత కుటుంబ సభ్యుల్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ఆర్ ప్రేమయ్య (71) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆయన మృతి పట్ల దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రావుల రవీంద్రనాథ్ రెడ్డి, పలువురు ప్రముఖులు మాజీ అధికారులు, పట్టణ వాసులు పాల్గొని నివాళి అర్పించారు.

అమరచింత: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఐఎన్‌టీయూసీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ ప్రేమయ్య మృతి కార్మిక లోకానికి తీరని లోటు అని ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఎస్.దాసు, ప్రధాన కార్యదర్శి తౌఫిక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరాజు, సవరన్న, జాషువా, హనుమంత్ నాయక్, చిరంజీవి పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో వ్యర్థ జలాలు వదలొద్దు

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యర్థజలాలు వదలొద్దని పుర కమిషనర్ నూరుల్ నజీబ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని సాయి దుకాణ సముదాయంలో పలువురు హోటల్ పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారని, హోటల్ నిర్వహణ కోసం వినియోగించే నీరు పాఠశాల ఆవరణలోకి వదలడం వల్ల పారిశుద్ధ్య లోపంతో విద్యార్థులు, నడక, వ్యాయామానికి వచ్చే వారు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. నీటిని వదిలేవారు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలని తాఖీదులు ఇచ్చామన్నారు.

పింఛన్లు ఇవ్వాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అమరచింత, న్యూస్‌టుడే : ఆసరా పథకం పింఛన్లను ప్రతి నెల లబ్ధిదారులకు సకాలంలో ఇవ్వాలని శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ లబ్ధిదారులకు డబ్బులు ఖాతాల్లో ఆలస్యంగా జమ అవుతున్నాయని తెలిపారు. గత నెల పింఛన్ డబ్బు అందలేదని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పుర కమిషనర్ నూరుల్ నజీబ్ లబ్ధిదారుల అవస్థలపై డీఆర్డీవోతో మాట్లాడి వారం రోజులో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సామేల్, రాంచందర్, నాగప్ప, మహేందర్, కృష్ణయ్య, ఆశన్న పాల్గొన్నారు.